# దృష్టద్యుమ్నీయం

దృష్టద్యుమ్నరావు అని అతనికి నామకరణం చేసింది సాక్షాత్ అతని తండ్రైన చింబయ్యే.

వాడు చేతిలోకి వచ్చే ప్రతి కాగితము చింపే అలవాటు చేసుకుంటాడనిగానీ, పెద్దవాడయ్యాక అతనికి చింపాంజి రూపం వస్తుందనిగానీ అతని తల్లిదండ్రులకు ఏమాత్రం సందేహం కూడా కలుగలేదేమో! ఒకనెల ప్రాయంలో పిల్లలంతా ఒకేలాగుంటారు. తనకు తన పేరు తెచ్చిన దోషంలాగా, తన కొడుకుకు రాకూడదని అనుకొని చింబయ్య తన ఏకైక సంతానానికి మామూలుగా ఎవరికీ వుండడానికి వీల్లేని - అంటే అసాధారణమైన పేరు పెట్టడం జరిగింది. పెరుగుతున్న దృష్టదుమ్నుడికి తన పేరు అసలు నచ్చలేదు. సమర్థుడుగా చదువుకొని, ఒక పోలీసు ఆఫీసరుగా రూపధారణం చేసిన తరువాతనే ఆ యువకుడు తన పేరుకు ఒక కొత్త రూపం ఇచ్చాడు. కె. దృష్టద్యుమ్మరావు అని అతను దాని తర్వాత ఎప్పుడూ గూడా వ్రాయడంగాని, చెప్పడంగాని చేయలేదు. ఆ నామధేయమును హ్రస్వముచేసి కె. డి. డి. రావు అని చెప్పేటప్పుడు దాని వెనక ఒక దృష్టద్యుమ్నుడు దాక్కొని వున్నాడని మానవులలో ఎవరూ కూడా అనుకోరుగదా!

పేరు మార్చుకున్నా కూడా మనిషి మారుతాడా? డి.ఎస్.పి.గా పనిచేసేటప్పుడు అతను సర్కిల్ ఇన్స్పెక్టర్లకు, సబ్ ఇన్స్పెక్టర్లకు, హెడ్‌గార్లకు మరియు మామూలు అగ్గి పుల్లలకు కూడా అతను ఒక సింహస్వప్నంగా వుండేవాడు. ఎందుకంటే నోరుతెరిస్తే బూతులే. తన ఏకచ్ఛత్రాధిపత్యం క్రింద బ్రతికేవాళ్లంతా తన బానిసలని ఒక ధారణ అతనికుండేది. తన సిబ్బంది అంతా వట్టి పురుగులు, తనుమాత్రం పైలోకం నుంచి క్రిందకు దిగివచ్చినవాడు

అనే ఒక భావం అతనికుండేదేమో! అతని మాటలు, ప్రవర్తన అంతా కూడా అలాంటి ఒక భావాన్నే తెలుపుతుండేవి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పది సంవత్సరాల తర్వాత కూడా అతనికి బ్రిటీష్ ఇండియన్ పోలీస్‌వారి ''ఇంపీరియల్ కల్చర్'' వుండేది. దాని గురించి ఎలాంటి పరిశోధన చేయడం అనవసరం. ఎందుకంటే ఏ డిపార్ట్‌మెంట్‌లోగాని ఏ సమాజములోగాని, సంస్థలోగాని, సమూహములలోగాని వున్నట్టు పోలీసు డిపార్ట్‌మెంటులో గూడా రకరకాల వ్యక్తులు వుండకుండా వుండరు.

కె.డి.డి రావు వస్తుతః ఒక మంచి మనిషి, తన సిబ్బందిని తిట్టడానికి, కొట్టడానికి, తనకు అధికారముందని నిజంగా నమ్ముతున్నాడు. ఒక కుటుంబ పెద్ద తన పిల్లలపై సామదాన భేద దండోపాయాలు ప్రయోగం చేయు విధంగా, తన సిబ్బందిపై కూడా అజమాయిషీ చేయడంలో తప్పులేదని అతను అనుకుంటాడు. అతను తిట్టడం, కొట్టడం లాంటివి చేస్తుంటాడే తప్ప ఎవరికీ అపకారం చేసేవాడు మాత్రం కాదు. ఇప్పటివరకూ అతను ఎవరిపొట్టా కొట్టలేదు. కాని ఒక విషయం - తన సిబ్బందితో వ్యవహరిస్తున్నట్టు, తన పై అధికారి తనతో వ్యవహరించకూడదు. పై అధికారులపై అతనికి మామూలుగా సదభిప్రాయం వుండేది కాదు. వాళ్లు ఏదైనా ఉపదేశంకాని, నిర్దేశంగాని ఇస్తే, కె.డి.డి రావు కొద్దిగా తారాస్థాయిలో మాట్లడడం అప్పుడప్పుడూ జరిగే విషయం. అందువల్ల పై అధికారులు అతన్ని పెద్దగా పట్టించుకోరు. అతన్ని బాధించరు. అలా అని అతనికి ఎవరూ మేలు చేయడానికీ ఇష్టపడరు.

డిపార్ట్‌మెంటులో దుర్మార్గులైన ఒకరిద్దరు అధికారులు ఎప్పుడూ వుంటారు. అందులో ఒకరకం ఎలా వుంటారంటే, ఇంగ్లీషులో ''క్యరియరిస్ట్'' అని పేర్కొనబడుతున్న, ''ఏం జరిగినా పరవాలేదు - నేను మాత్రం బాగుపడాలి'' అనేవాళ్ళు. అలాంటి, ఒకడికి, తన సిబ్బందిలో ఎంతమంది బలిపశువులైనా ఫరవాలేదు. తన పై అధికారుల మరణం, అనారోగ్యం, సస్పెన్షన్ ఇలాంటి ఏ కారణాలవల్లగాని, తన ప్రమోషన్‌కి మార్గం సుగమం అయితే దానికి చాలా సంతోషించేవాడు. అలాంటి ఒకడికి, ఎవరూ మంచివాళ్లు కారు, సమర్థులు కారు. ప్రగద్భ్యమతులు కారు. తనకు సమతుల్యంగా డిపార్టుమెంటులో ఎవరూ లేరనే అతను అనుకుంటుంటాడు. మంచి అధికారం గల ఒక పదవిలో వుంటే, ఆ అభిప్రాయం తీక్షణంగా బయట పెడతారు కూడా. కాని, అధికారం అనగా అది కులపరంగా కావచ్చు, రాజకీయ పార్టీపరంగా కావచ్చు లేక ముఖ్యమంత్రితో వున్న దగ్గర సంబంధంవల్ల కావచ్చు.

పోలీసు డిపార్టుమెంటు అనే కాదు, ఏ డిపార్టుమెంటులో అయినా కూడా ఒక అధికారి తానొక సర్వజ్ఞుడనని, తనకు తెలిసినంత ఇతరులకు తెలియదని అనుకుంటే ఆ

ఆలోచనలతో అతని తలకాయ వాచిపోతుందే తప్ప, డిపార్టుమెంటుకుగాని, ప్రజలకుగాని ఒరిగేదేమన్నా వుందా? పోలీసు డిపార్టుమెంటులోని చట్టాలు, నియమాలు, నిబంధనలను అన్నింటిని పొడిచేసి, షర్బత్‌లాగా తాగినా, అతను ఒక మంచి పోలీసు అధికారి అవుతాడా? తను సర్వజ్ఞుడననే అహంభావం ఇతరులముందు బిడియం లేకుండా వడ్డిస్తే తను గొప్పవాడిగా చెలామణి అవుతానని అనుకుంటాడు. ఆ అహంభావ ప్రకటనవల్ల ఇతరులలో కలిగేది గౌరవం కాదు వాంతులు, జుగుప్స. తాను నిండుకుండగా నటిస్తే, ఇతరులకు దానివల్ల ఏమి ప్రయోజనము. ఆ కుండలో వుండేదానివల్ల నలుగురికి మేలు జరిగితేనే దానికి సార్థకత చేకూరుతుంది.

స్వప్రయోజనం కోసం అవసరమయితే కాళ్లు పట్టుకొని, సమయమొచ్చినప్పుడు వెన్నుపోటుపొడిచేవాళ్లు పోలీసు డిపార్టుమెంటులో కొంతమంది వున్నారు.

పై రకరకాల వాళ్లతో పోల్చిచూస్తే మన కె.డి.డి. రావు ఎంతో ఉత్తముడిగా వర్గీకరింపబడాలి.

కె.డి.డి. రావుకు ప్రమోషన్ వచ్చి జిల్లా సూపరింటెండెంట్ అయిన తర్వాత తిట్టడం, కొట్టడం లాంటివి పెరుగుతూనే వచ్చాయి. జిల్లాకు అధీశుడు కదా? అతను ఎక్కడికి టూరు వెళ్లినా అతని సిబ్బంది గజగజ వణికేవారు. ఒక్క ట్రిప్పులో కనీసం, పది, పదిహేను మంది తప్పకుండా తిట్లు తింటారు -- అవి తిట్లు కాదు పులిసిన బూతులు. కొంతమందికి ''బ్యాటన్'' ప్రహార అదృష్టం కూడా కలుగుతుంది. ఇదేమీ రహస్యంగా కాదు జరిగేది - ప్రజల సమక్షంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌నుగాని, సబ్ ఇన్‌స్పెక్టర్‌నుగాని అలా తిడితే, వాళ్ల విలువ ఎంతగా దిగజారిపోతుందో అని అతను ఆలోచించడు. డిపార్టుమెంటులో అతనిని చాలామంది కె.డి. రావు అనిగాని, దుష్టద్యుమ్నుడు అనిగాని రహస్యంగా పిలుచుకుంటారు.

ఒకరోజు ఉదయం వ్యాహ్యాళికి వెళ్లి తిరిగి బంగ్లాకు వచ్చినప్పుడు తన ''గార్డ్ ఇన్‌ఛార్జ్'' అయిన హెడ్‌కానిస్టేబుల్, క్యాంప్‌క్లర్క్ ఫోనులో మాట్లాడుతున్నట్టు గమనించిన కె.డి.డి. రావుకు భలే కోపం వచ్చింది. 'ఇతనికి ఏ వెధవతో మాట్లాడాలన్నా నా క్యాంప్ క్లర్క్ ఫోనే కావలసి వచ్చిందా?' అతని చేతిలో వున్న బ్యాటన్ పగిలిపోయేదాకా ఆ హెడ్‌కానిస్టేబుల్‌ను చావబాదాడు. ఏదో చెబుదామని అతను సర్! సర్! అని ఏడుస్తూనే అంటున్నాడు. కాని తెలుగులో, ఇంగ్లీషులో, ఉర్దూలో బూతులు తిడుతున్న ఆ కె.డి.డి. రావుకు ఆ దీనుడి మాటలు వినడానికి ఏమైనా ఓపిక వుందా?

కొట్టి కొట్టి అలసిపోయిన అతను ఇంట్లోకి వెళ్లాడు.

కొంతమంది ఇంటి పెద్దలు ఊళ్లో పులి, ఇంట్లో పిల్లిగా వుంటారు. కాని ఈ

దృష్టద్యుమ్నుడు అలాంటివాడు కాదు. అతని భార్యకు, ఇద్దరు అమ్మాయిలకు అతని మీదున్న ప్రేమకు పదింతలు భయముండేది. పెద్దమ్మాయి ఐదో తరగతి, రెండో అమ్మాయి రెండో తరగతి అక్కడే వున్న కాన్వెంట్‌లో చదువుతున్నారు. ఆరోజు ఒక క్రైస్తవ పండుగ కావడంవల్ల స్కూలు వుంటుందా లేదా అని ఎస్పీగారి భార్యకు అనుమానంగా వుంది. పిల్లలిద్దరూ ''స్కూలు వుంది స్కూలు వుంది'' అని మొరపెట్టడంతో ఆమె బయటకు వచ్చి, గార్డులో వున్న ఆ హెడ్‌కానిస్టేబుల్‌తో స్కూలుకు ఫోను చేయమని చెప్పింది. ఆ ప్రకారంగా పాపం ఆ హెడ్‌కానిస్టేబుల్ ఫోన్‌చేస్తుండగానే ఎస్పీగారు రావడం అతన్ని క్రూరంగా కొట్టడం జరిగింది.

భర్తతో జరిగింది వివరిస్తూ ''చాలా ఘోరం జరిగిపోయింది'' అని చెప్పి బాధపడుతుండగా ''అసలు నీకే రెండు తగిలించాలి'' అన్నాడు.

కాని అది ఆ కథకు ముగింపు కాదు - సంఘటనల పరంపరకు, ఆ క్రూర మర్దనం నాంది అయింది. ఆ జిల్లా ''ఆర్మ్‌డ్ రిజర్వ్'' లోపల ఆ దుస్సంఘటన గురించే విపులమైన చర్చలు రహస్యంగా జరిగినాయి. కొన్ని నిర్ణయాలు రూపం దాల్చడం కూడా జరిగింది.

వాటి ప్రకారంగా -

ఒకరోజు ఉదయం ఎస్పీగారు వాహ్యాళికి బంగ్లా బయటకు వచ్చే సమయంలో ఒక ఆర్డర్లీ వరండాలోని ఒక స్తంభానికి జారిగిలబడి నిద్రపోతున్నాడు. ఎస్పీగారు దగ్గరకు వచ్చిన సంగతి అతనికి తెలియలేదు. ఆ దుర్వాసుడి సంస్కృతగర్జన విని వులిక్కిపడి లేచి నిలబడి సెల్యూట్ చేశాడు. కాని బూతులు తిడుతూ, చెంప చెడాలుమనిపించాడు. ఒక పాతగుడ్డపీలికలా అతను కూలబడిపోయాడు. ఎస్పీ ఇంకా తిడుతూనే వున్నాడు. పాపం ఆ ఆర్డర్లీ స్పృహతప్పి పడివున్నాడు. మరొక ఆర్డర్లీ గార్డ్ పార్టీ నుంచి ఒక కానిస్టేబుల్ అక్కడికి పరుగెత్తుకొచ్చాడు.

''ఇతని మొహం పై కాస్త నీళ్లు చిలుకరించు - ఒక టీ కూడా ఇప్పించు'' అని మరో అర్డర్లీకి చెప్పి ఎస్పీగారు వాహ్యాళికి వెళ్లిపోయారు.

నీళ్లు చిలకరించినంతమాత్రాన ఏమీ కాలేదు. కంట్రోలు రూమునుంచి కారు వచ్చి స్పృహతప్పి, తోటకూరకాడలా వాలిపోతున్న అతన్ని హాస్పటల్‌కు తీసుకుపోయింది.

ఎస్పీగారు ఆరోజు ఒకగంట నుంచి వాహ్యాళిని అరగంటకు తగ్గించి వచ్చేశారు. రాగానే ఆ ఆర్డర్లీ విషయం గురించి అడగడమూ, అతన్ని అసుపత్రికి తీసుకవెళ్లినట్టు తెలుసుకోవడం జరిగింది. ఆయన ఒక పెద్ద పోలీసు అధికారిగదా? ఇలాంటి చిన్న చిన్న విషయాలకు ఆయన అంతగా కలవర పడకూడదు. ఆయన స్నానం ఇత్యాది కార్యక్రమాలు

మొదలు పెట్టారు. స్నానాలగదిలో వుండగా బయట ఏదో గొడవ జరుగుతున్నట్టు ఆయనకు వినబడింది. స్నానం చేసి బయటకు రాగానే ''ఆర్మడ్ రిజర్వ్' వాళ్లు ఆయనకు వ్యతిరేకంగా చేస్తున్న తిరుగుబాటు అని తెలుసుకున్నాడు. ఆయన అంతవరకు వేసుకున్న ధైర్యం అనే ముసుగు తొలగిపోయి, దాని స్థానంలో పాలిపోయిన అసలు ముఖం కనబడింది.

అతని భార్యా, పిల్లలు ఏడ్వడం మొదలు పెట్టారు. గేటుకు అవతల అల్లరిచేస్తున్న ఆ పోలీసు వాళ్లు లోపలికి చొచుకొచ్చి మొత్తం కుటుంబాన్ని ఎక్కడ చిత్రవధ చేస్తారో అని ఆమె భయం.

టౌన్ డి.ఎస్.పి. పరుగెత్తుకొచ్చాడు. 'స్పృహతప్పిన కానిస్టేబుల్ కోలుకున్నాడు, స్పృహ తప్పడం 'షాక్' వల్లనేనని డాక్టరుగారు చెప్పినట్టు' ఎస్పీగారికి తెలియజేశాడు. డి.ఎస్పీ గేటు బయటకు వచ్చి, కోపంతో వుడికిపోతున్న పోలీసు వాళ్లతో అనునయంగా మాట్లాడడానికి ప్రయత్నం చేశాడు, ఆందోళన సమాప్తం చేయమని వాళ్లను అతిదీనంగా అర్థించాడు. కాని ఎస్పీ పైకేసు నమోదు చేయాలని, ఆయన్ని ఆరెస్ట్ చేయాలని, డి.ఐ.జి.ని పిలిపించాలని పట్టుబట్టారు. రెండుగంటల తీవ్ర ప్రయత్నం తర్వాత క్రమశిక్షణ మరిచిపోయిన ఆ పోలీసు గుంపును చల్లబరచి వెనక్కి పంపడంలో కృతకృత్యుడయ్యాడు. చెమటలు కార్చుకుంటూ, అలసిపోయి తిరిగివచ్చిన డిఎస్పికి ఆ పెద్దమనిషి ఒక చిన్న ''థాంక్యూ'' సాంక్షన్ చేశాడు. డిఎస్పికి అదొక ''గ్యాలంట్రీ మెడల్'' లభించినంత ఆనందం కలిగింది. ''డి.ఐ.జి.గారు సాయంత్రం వస్తున్నార్లే. విషయాలన్నీ ఆయనకు తెలిపాను'' అని కూడా ఆ విషణ్ణవదనుడు గొణగడం జరిగింది.

డి.ఐ.జి. వచ్చాడు. ఎంక్వైరీ జరిగింది. వారి రిపోర్టు ఐ.జి.కి. వెళ్లింది. ఎస్పీపైన క్రమశిక్షణ చర్య తీసుకొనబడింది. చివరకు అతనికి వచ్చిన పనిష్మెంట్ ఒక ''సెన్సార్'' మాత్రమే.

కాని పోలీసువాళ్లకు కావాల్సింది అతని ప్రవర్తనలో మార్పు.

అతని తాడన పీడనాలన్నీ వాటంతట అవే చల్లారిపోయాయి. భార్యాపిల్లలతో కూడా అతను సౌమ్యంగా మసలుకోవడం మొదలు పెట్టాడు.

ఒక చెంప పెట్టుతో, ఆర్డర్లీ స్పృహకోల్పోవడం, నీళ్లు మొహంపై చిలకరించినా లేవకపోవడం, ఆసుపత్రికి తీసుకపోవడం, ఆర్మడ్ రిజర్వ్ తిరుగుబాటు, ఎస్పీపై క్రమశిక్షణా చర్య జరిపించడం - ఇవన్నీ కె.డి.డి. రావుకు గుణపాఠం నేర్పడానికి కొంతమంది చేసిన కుట్ర అనే విషయం తెలియకపోవడమే ధృష్టద్యుమ్నరావుగారి స్వభావ పరివర్తనకు ముఖ్య కారణం.